క్లుప్తంగా

పెస్టిసైడ్ దుకాణంలో చోరీ

మరిపెడ: మరిపెడలోని సూర్యతేజ పెస్టిసైడ్స్ దుకాణంలో గురువారం రాత్రి చోరీ జరిగింది. దుకాణం వెనుక నుంచి దొంగలు షాపులోకి చొరబడి కౌంటర్‌లోని నగదును ఎత్తుకెళ్లారు. యజమాని కృష్ణమూర్తి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్సైలు పవన్, సంతోష్ షాపులో పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నూతన భవనంలోకి డీసీఓ



మహబూబాబాద్ రూరల్: కలెక్టర్ భవన సముదాయంలోని జిల్లా సహకార అధికారి కార్యాలయంలో శుక్రవారం డీసీఓ సయ్యద్ ఖుర్షిద్ ఆధ్వర్యంలో సంబంధిత అధికారులు, సిబ్బంది విధులు ప్రారంభించారు. డీసీఓ పర్యవేక్షకుడు రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సహారా ఖాతాదారులకు డబ్బు చెల్లించాలి

మహబూబాబాద్ రూరల్ : సహారా ఇండియాలో డబ్బు కట్టిన వారికి వెంటనే చెల్లించాలని ఆల్ ఇండియా జన్ ఆందోళన సంఘర్ష న్యాయ మోర్చా జాతీయ అధ్యక్షురాలు పూజిత డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీ ద్వారా డబ్బు సేకరించొద్దని సుప్రీం కోర్టు ఆదేశించినప్పటికీ సహారా సంస్థలో పనిచేస్తున్న వారు డబ్బు సేకరిస్తున్నారని తెలిపారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, మోసపూరిత మాటలు నమ్మొద్దని సూచించారు. ఖాతాదారులకు జరిగిన అన్యాయాన్ని ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్, ఎస్పీ శరత్ చంద్ర పవార్ దృష్టికి తీసుకువెళ్లామని చెప్పారు.

మహాయాత్రకు తరలిరావాలి

దంతాలపల్లి: నేటి(శనివారం) నుంచి నిర్వహించతలపెట్టిన దేవరపెట్టి మహాయాత్రకు తరలిరావాలని యాత్ర జిల్లా బాధ్యుడు వల్లపు కళింగ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ తొర్రూరు మండలం చీకటాయపాలెం నుంచి యాత్ర ప్రారంభమై దంతాలపల్లి, మద్దిరాల, నూతనకల్ మండలాల మీదుగా లింగమంతుల జాతర సమీపంలో గల కేసారం గ్రామం వరకు సాగుతుందని తెలిపారు.

క్రీడాకారులకు టీషర్ట్స్ పంపిణీ

దంతాలపల్లి: ఈ నెల 21, 22వ తేదీల్లో మెదక్ జిల్లాలోని ఇందిరాగాంధీ స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో మానుకోట జిల్లా నుంచి 35 మంది క్రీడాకారులు పాల్గొననున్నారు. ఎంపీ వద్దిరాజు రవిచంద్ర వారి కోసం ఇచ్చిన టీషర్ట్స్‌ను వద్దిరాజు దేవేందర్ అందించినట్లు మానుకోట జిల్లా అథ్లెటిక్స్ అసోషియన్స్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి రేణుకదేవి, పద్మావతి శుక్రవారం తెలిపారు.

వేయింగ్ మిషన్ల అందజేత

కేసముద్రం: మండలంలోని బేరువాడ గ్రామంలో గల రెండు అంగన్‌వాడీ కేంద్రాలకు సర్పంచ్ ముదిగిరి సాంబయ్య శుక్రవారం రెండు వేయింగ్ మిషన్లు అందజేశారు. అదే విధంగా క్యాంపుతండా జీపీ శివారు మాతృతండా అంగన్‌వాడీ సెంటర్‌కు పూర్వ విద్యార్థి, సివిల్ సర్జన్ డాక్టర్ శారద వేయింగ్ మిషన్ అందజేశారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ దుర్గా, కార్యదర్శి శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీకి దాతల సహకారం

మరిపెడ రూరల్: మరిపెడ మండలం వీరారం బీసీ కాలనీలోని అంగన్‌వాడీ భవనం శిథిలావస్థకు చేరి స్లాబ్ పెచ్చులూడుతోంది. దీంతో విద్యార్థులు, నిర్వాహకులు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. ఈ క్రమంలో అంగన్‌వాడీ టీచర్ గంట కవిత అభ్యర్థన మేరకు దాతలు స్పందించారు. గ్రామానికి చెందిన కట్కూరి శ్రీనివాస్‌రెడ్డి, కిషోర్‌రావు, నవీన్‌యాదవ్, బావుసింగ్ రూ.20 వేల ఆర్థిక సాయం అందించారు. ఆ డబ్బుతో భవనానికి మరమ్మతులు చేయించి రంగులు వేయించారు.

తొర్రూరు తహసీల్దార్‌గా నాగేంద్రప్రసాద్

తొర్రూరు: తొర్రూరు తహసీల్దార్‌గా గోవర్ధనగిరి నాగేంద్రప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ తహసీల్దార్‌గా పని చేసిన వేమిరెడ్డి రాఘవరెడ్డి సెలవుపై వెళ్లారు. భూ సమస్యల పరిష్కారంలో బలవంతపు వసూళ్లు, మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినట్లు ఆరోపణలు వెల్లువెత్తడంతో ఉన్నతాధికారుల సూచన మేరకే ఆయన సెలవు పెట్టి వెళ్లినట్లు విశ్వసనీయ సమాచారం.

ఆర్థికసాయం

దంతాలపల్లి: మండలంలోని బొడ్లాడలో షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు కాలిపోయి సర్వం కోల్పోయిన శంకరబోయిన వెంకన్న కుటుంబ సభ్యులను బీజేపీ నాయకులు శుక్రవారం పరామర్శించారు. ఈ మేరకు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. అలాగే, పొలం దున్నుతూ ప్రమాదానికి గురైన పులుగుజ్జ వెంకన్నకు రూ.5 వేలు అందజేశారు. మహేష్, మదన్‌నాయక్, పాపారావు పాల్గొన్నారు.

కంటి పరీక్షలు చేయించుకోవాలి

మహబూబాబాద్ రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కంటి వెలుగు పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైస్ ఎంపీపీ ఎల్ది మల్లయ్యగౌడ్ సూచించారు. మహబూబాబాద్ మండలంలోని కంబాలపల్లిలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల వద్దకే వైద్యులను పంపి కంటి పరీక్షలు నిర్వహించి పరిష్కరించడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ సుధీర్నాయక్, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

300 మందికి కంటి పరీక్షలు

గార్ల: గార్లలోని కంటి వెలుగు శిబిరంలో శుక్రవారం 300 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు ములకనూరు పీహెచ్‌సీ డాక్టర్ అవినాష్ తెలిపారు. అంధత్వం ఉన్న 110 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేసి, కంటి శస్త్రచికిత్సలు అవసరమైన 40 మందిని జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేసినట్లు పేర్కొన్నారు.

డోర్నకల్: మండల కేంద్రంలోని అశోక్‌భవన్‌తో పాటు అమ్మపాలెం, బూరుగుపాడు గ్రామాల్లో కంటి వెలుగు శిబిరాలు రెండో రోజు కొనసాగాయి. డోర్నకల్‌లో 165 మందికి, అమ్మపాలెంలో 190, బూరుగుపాడులో 210 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 148 మందికి కంటి అద్దాలు పంపిణీ చేయగా, మరో 73 మందికి అవసరమైన కంటి అద్దాలను ఆర్డర్ చేశారు. పీహెచ్‌సీ డాక్టర్ కనకదుర్గ శిబిరాలను పర్యవేక్షించారు.



డోర్నకల్: కంటి వెలుగు శిబిరంలో బారులుదీరిన వృద్ధులు

సెకండ్ ఏఎన్ఎంల నిరసన

గూడూరు: ఇప్పటికే పని భారంతో సతమవుతున్న తమపై కంటి వెలుగు కార్యక్రమం పేరుతో అదనపు భారం మోపడం సరికాదని సెకండ్ ఏఎన్ఎంలు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. సంఘం రాష్ట్ర బాధ్యుల ఆదేశాలకు మేరకు మండలంలోని తీగలవేణి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరంలో సెకండ్ ఏఎన్ఎంలు కళావతి, శోభ, తదితరులు శుక్రవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తూ పనిచేశారు. వారు మాట్లాడుతూ కంటి వెలుగు సందర్భంగా ఆన్‌లైన్ ద్వారా 32 రకాల సేవలు నమోదు చేయాలని ఆదేశించారన్నారు. అందుకు ఎలాంటి అదనపు పారితోషికం ఇవ్వడం లేదని, తమ సమస్యలు పట్టించుకునే వారేలేరని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే అయోధ్యపురం పీహెచ్‌సీ పరిధిలో 16 మంది, తీగలవేణి పీహెచ్‌సీ పరిధిలో ఆరుగురు నిరసన తెలిపారు.

కేసముద్రంలో..

కేసముద్రం: కేసముద్రం, ఇనుగుర్తి మండలాల పరిధిలో కంటి వెలుగు శిబిరాల్లో విధులు నిర్వరిస్తున్న సెకండ్ ఏఎన్ఎంల నిరసన రెండో రోజు శుక్రవారం కొనసాగింది. రోజంతా వారు నల్లబ్యాడ్జీలు ధరించి విధుల్లో ఉన్నారు. న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఆర్టీసీ సేవలు వినియోగించుకోవాలి

కొత్తగూడ: ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలని నర్సంపేట ఆర్టీసీ డిపో మేనేజర్ విజయమాధురి సూచించారు. ప్రజల వద్దకే ఆర్టీసీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆర్టీసీ సేవలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లెల రణధీర్, పంచాయతీ కార్యదర్శి సుమన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మేనేజర్ విజయమాధురి

రాజగోపుర ద్వారానికి తలుపులు ఏర్పాటు



కురవి: మండల కేంద్రంలోని భద్రాకాళి సమేత వీరభద్రస్వామి ఆలయం ఎదురుగా ఉన్న ఉత్తర రాజగోపురం ముఖద్వారానికి శుక్రవారం టేకు తలుపులు అమర్చారు. కాగా, కురవికి చెందిన విశ్వబ్రాహ్మణుడు దూదికట్ల శ్రీనివాసాచారి ప్రత్యేకంగా తెప్పించిన టేకు కలపతో తలుపులను అందంగా తీర్చిదిద్దారు. శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈ ద్వారం భక్తులకు ఉపయోగంలోకి రానుంది.

జీవన ఎరువులతో అధిక దిగుబడి

గార్ల: జీవన ఎరువులు వాడి తక్కువ పెట్టుబడితో వరిలో అధిక దిగుబడి సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి కావటి రామారావు రైతులకు సూచించారు. శుక్రవారం గార్ల పంచాయతీ పరిధి గండి గ్రామంలో రైతులు సాగు చేసిన వరి పొలాలను ఆయన పరిశీలించారు. భాస్వరాన్ని కరిగించి మొక్కకు అందించాలంటే జీవన ఎరువులైన పాస్ఫో బ్యాక్టీరియా, సూడోమోనాస్‌ను వాడాలని సూచించారు. తద్వారా మొక్క వేరు వ్యవస్థ బాగా వృద్ధి చెంది ఎక్కువ సంఖ్యలో పిలకలు వస్తాయని పేర్కొన్నారు. ఎకరాకు 2 కేజీల సూడోమోనాస్, లీటరు పాస్ఫో బ్యాక్టీరియా నాటుకు ముందు ఇసుకలో కలిపి దుక్కిలో చల్లుకోవాలని తెలిపారు. ఏఓ వెంట ఏఈఓ నాగరాజు, రైతు రాము తదితరులు ఉన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ రామారావు

అనాథ పిల్లల సమస్యలు పరిష్కరించాలి

బయ్యారం: అనాథ పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెర్పీఎస్ జిల్లా కోఆర్డినేటర్ గుగ్గిళ్ల పీరయ్యమాదిగ కోరారు. ఈ మేరకు నాయకులతో కలిసి శుక్రవారం ఇల్లందు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే హరిప్రియకు వినతిపత్రం అందజేశారు. అనాథ పిల్లలకు రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటుతోపాటు నెలనెలా పింఛన్ ఇచ్చేలా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని వినతిలో కోరారు. శ్రీను, రాజేష్, గోవర్ధన్, అంజిబాబు, గోపి, రవి, సైదులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి

కేసముద్రం: చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే బంగారు భవిష్యత్ ఉంటుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా మండల కేంద్రంలో కేపీఎల్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు శుక్రవారం ముగిశాయి. ఆయన హాజరై ప్రథమ స్థానంలో నిలిచిన మహబూబాబాద్ జట్టుకు షీల్డుతోపాటు రూ.30,116 నగదు అందజేయగా, ద్వితీయ స్థానంలో నిలిచిన కేసముద్రం జట్టుకు షీల్డు, రూ.20,116 అందజేశారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు డాక్టర్ మురళీనాయక్, పీసీసీ సభ్యుడు గుగులోత్ దస్రూనాయక్, మండల అధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, బండారు వెంకన్న, మాజీ సర్పంచ్ డాక్టర్ అల్లం రమ, ధన్నసరి సొసైటీ వైస్ చైర్మన్ అల్లం నాగేశ్వర్‌రావు, ధన్నసరి గ్రామ ఉపసర్పంచ్ బానోతు వెంకన్న, శంకర్, తండా వెంకటేశ్వర్లు, గణేష్, అఖిల్, సత్యనారాయణ పాల్గొన్నారు.



మానుకోట జట్టుకు షీల్డు అందజేస్తున్న నాయకులు

విద్యార్థులకు టై, బెల్టుల పంపిణీ

కురవి: మండలంలోని సూదనపల్లి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు స్ఫూర్తి ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం టై, బెల్టులు పంపిణీ చేశారు. కాగా, ప్రతాపని రాజేశ్వర్‌రావు అతడి తల్లిదండ్రులు కనకలక్ష్మీ–వెంకటకృష్ణయ్యల జ్ఞాపకార్థం వాటిని పంపిణీ జరిగింది. సొసైటీ వ్యవస్థాపకుడు రామసహాయం శ్రీధర్‌రెడ్డి, హెచ్ఎం ధారావత్ వెంకన్న, సొసైటీ సలహాదారుడు ఆకుల శ్రీకాంత్, ఉపాధ్యాయులు చిన్నం ప్రదీప్‌కుమార్, జి.మాదవరావు, ఎండి అంజద్‌పాషా, ఎస్‌కే అస్మత్ పాషా, బి.విజయ్, బి.సంధ్యారాణి పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత

మహబూబాబాద్: రోటరీ క్లబ్ వరంగల్ శాఖ కార్యాలయంలో మండలంలోని మాధవాపురం జెడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థుల కోసం రూ.20 వేల విలువ చేసే ఆల్‌ఇన్ వన్ స్టడీమెటీరియల్‌ను ఉపాధ్యాయురాలు స్నేహలతకు శుక్రవారం అందజేశారు. పదో తరగతి విద్యార్థుల కోసం రోటరీ క్లబ్ వరంగల్ శాఖ చైర్మన్ రాజయ్య, ప్రధాన కార్యదర్శి కుమారస్వామి స్టడీ మెటీరియల్ అందజేసిన్నట్లు పాఠశాల హెచ్ఎం బద్రి నారాయణ తెలిపారు.

వార్డుల అభివృద్ధికి కృషి

నెహ్రూసెంటర్: మహబూబాబాద్ మున్సిపాలిటీ వార్డుల అభివృద్ధికి కృషి చేస్తామని సీపీఐ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారధిరెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 36వ వార్డులో రూ.1.50 లక్షల ఎల్ఆర్ఎస్ నిధులతో జరుగుతున్న సీసీ డ్రెయిన్ పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వార్డులో సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్లు, కల్వర్టు, ఇతర పనులకు నిధులు కేటాయించి పూర్తి చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో 36వ వార్డు కౌన్సిలర్ బి.నీరజారెడ్డిధర్మన్న, వార్డువాసులు గాదెం శ్యాంప్రసాద్, బానోత్ ప్రవీణ్‌కుమార్, యాకన్న, నవీన్, అజయ్, శ్రీదేవి, పావని, శాంత, రమేష్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న అజయ్‌సారధిరెడ్డి

సింహగర్జనను జయప్రదం చేయాలి

బయ్యారం: కొత్తగూడలో తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఈ నెల 29న నిర్వహించ తలపెట్టిన ఆదివాసీ సింహగర్జన సభను జయప్రదం చేయాలని తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్ పిలుపునిచ్చారు. శుక్రవారం బయ్యారంలో పార్దు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివాసీ అమరుల త్యాగాల ఫలితంగా వచ్చిన ఐదో షెడ్యూల్‌లోని ఆదివాసీలకు స్వయం పరిపాలన కావాలన్నారు. ఏజెన్సీలోకి అక్రమంగా వచ్చిన గిరిజనేతరులను మైదాన ప్రాంతాలకు పంపించాలని డిమాండ్ చేశారు. రామనాథం, విక్రం, రమేష్, భిక్షం, రాజేష్, లింగరాజు పాల్గొన్నారు.

క్రీడా మైదానం కోసం చెట్ల నరికివేత

గార్ల: మండలంలోని రాంపురం పంచాయతీలో క్రీడా మైదానం ఏర్పాటు కోసం శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ పాఠశాలలోని పచ్చని చెట్లను సంబంధిత అధికారులు నరికి వేయించారు. హరితహారం పేరుతో సీఎం కేసీఆర్ మొక్కలు నాటిస్తుంటే ఏపుగా పెరిగిన చెట్లను అధికారులు నరికించడంపై గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రాంపురం పంచాయతీలో అసైన్డ్ భూమి వందల ఎకరాలు ఉన్నా పాఠశాలలో క్రీడా మైదానం ఏర్పాటు చేస్తూ చెట్లను నరికి వేయడంపై ఆవేదన వ్యక్తం చేశారు.



చెట్లు నరికించిన అధికారులు

గూడూరు ఎంపీడీఓగా రోజారాణి

గూడూరు: గూడూరు మండల పరిషత్ అధికారిగా రోజారాణి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీఓగా బాధ్యతలు నిర్వర్తించిన విజయలక్ష్మి దంతాలపల్లి ఎంపీడీఓగా బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో కేసముద్రం ఎంపీడీఓగా పనిచేస్తున్న రోజారాణి బదిలీపై గూడూరు ఎంపీడీఓగా వచ్చారు.

దంతాలపల్లి ఎంపీడీఓగా విజయలక్ష్మి

దంతాలపల్లి: మండల ఎంపీడీఓగా విజయలక్ష్మి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీఓగా విధులు నిర్వర్తించిన గోవిందరావు బదిలీపై డీఆర్‌డీఓ ఆఫీస్ వెళ్లగా, ఆయన స్థానంలో పెద్దగూడూర్ నుంచి విజయలక్ష్మి బదిలీపై దంతాలపల్లికి వచ్చారు.

కేసముద్రం ఎంపీడీఓ బదిలీ

కేసముద్రం: కేసముద్రం ఎంపీడీఓ రోజారాణి బదిలీపై గూడూరు మండలానికి వెళ్లారు. కురవిలో ప్రత్యేక అధికారిగా పనిచేస్తున్న రవీందర్‌రావు డిప్యూటేషన్‌పై కేసముద్రం వచ్చారు.

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన నాయకులు

చిన్నగూడూరు: దంతాలపల్లి మండలంలోని కుమ్మరికుంట్ల మెయిన్ రోడ్డు నుంచి వయా గున్నపల్లి మీదుగా పడమటిగూడెం వరకు ఆర్అండ్‌బీ రోడ్డు కోసం ఎమ్మెల్యే రెడ్యానాయక్ సుమారు రూ.9కోట్ల 60 లక్షలు మంజూరు చేయించారు. దీంతో కుమ్మరికుంట్ల, తదితర గ్రామాల నుంచి నాయకులు, రైతులు తరలివచ్చి శుక్రవారం మండలంలోని ఉగ్గంపల్లిలో ఎమ్మెల్యేను కలిసి సన్మానించారు. ఎంపీపీ ఓలాద్రి ఉమ, పీఏసీఎస్ రాము, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వేణు, రాములు, ఎంపీటీసీలు వెంకన్న, మధుకర్‌రెడ్డి, సుధాకర్ రెడ్డి, నాయకులు ఉప్పల్ రెడ్డి, మల్లారెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేతో నాయకులు

మంగోరిగూడెం బాధితులకు ఆర్థికసాయం



బాధితుల కుటుంబీకులతో మంత్రి సత్యవతి



ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే రెడ్యా నాయక్

మహబూబాబాద్: డిసెంబర్ 31న జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన, తీవ్రగాయాల పాలైన కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. లారీ ఓనర్ పరిహారం ఇచ్చిన నేపథ్యంలో క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబాలు శుక్రవారం మంత్రిని కలిశాయి. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు లారీ ఓనర్ రూ.12 లక్షల సాయం అందించాడని, ఆ డబ్బును వారికి అందజేశామని తెలిపారు. మృతుల కుటుంబాల్లో ఒకరికి ఔట్ సోర్సింగ్ ద్వారా ఉద్యోగం ఇస్తామన్నారు. పిల్లల చదువు బాధ్యత పూర్తిగా ప్రభుత్వం చూసుకుంటుందని పేర్కొన్నారు.

చిన్నగూడూరు: ఇటీవల గ్రానైట్ లారీ ఢీకొని మండలంలోని మంగోరిగూడెం గ్రామానికి చెందిన ముగ్గురు మృతి చెందగా, ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి. కాగా, శుక్రవారం గ్రామంలో బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే రెడ్యానాయక్ ఆర్థిక సాయం అందించారు. గ్రానైట్ లారీ యాజమాన్యం ద్వారా ప్రమాదంలో మృతి చెందిన బానోత్ సుమన్, డొంకెన నవీన్, యాకారపు శ్రీకాంత్ కుటుంబ సభ్యులకు రూ.2లక్షల చొప్పున, తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రెండు కుటుంబాలకు చెందిన వారికి రూ. 2లక్షల చొప్పున అందజేశారు. అలాగే, గాయపడిన వారి కుటుంబాలకు రూ. 50వేల చొప్పున ముగ్గురికి సాయం చేశారు. ఎమ్మెల్యే రెడ్యా సైతం మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.10 వేల చొప్పున, గాయపడిన వారి కుటుంబాలకు రూ.2 వేల చొప్పున అందించారు. కలెక్టర్‌తో మాట్లాడి ఆపద్బంధు పథకం ద్వారా బాధిత కుటుంబాలను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ నాయకులు వెంకట్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి, రాంసింగ్, సర్పంచ్ నవీన్, సీఐ సాగర్, ఎస్ఐ రవికుమార్ పాల్గొన్నారు.

మంత్రులకే కళ్లజోడు అవసరం

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు భరత్‌చందర్‌రెడ్డి

కేసముద్రం: కళ్లజోడు పెట్టుకోవాల్సింది మేము కాదు.. రాష్ట్ర మంత్రులు, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, టీపీసీసీ సభ్యుడు గుగులోత్ దస్రూనాయక్ విమర్శించారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కంటి వెలుగులో పరీక్షలు చేయించుకుని కంటి అద్దాలు పెట్టుకుని అభివృద్ధిని చూడాలంటూ మంత్రి సత్యవతి రాథోడ్ విమర్శించడం సరికాదన్నారు. అసలు రాష్ట్రంలో అభివృద్ధి ఎక్కడ జరిగిందో మంత్రి చూపాలన్నారు. పోడు భూముల పట్టాలు, రుణమాఫీ, డబుల్ బెడ్రూం ఇళ్లు ఎక్కడని ప్రశ్నించారు. ముందు మీ పార్టీ వారు పరీక్షలు చేయించుకుని అభివృద్ధి ఎక్కడ జరిగిందో చూపించాలని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు డాక్టర్ మురళీనాయక్, మండల పార్టీ అధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, ధన్నసరి సొసైటీ వైస్‌చైర్మన్ అల్లం నాగేశ్వర్‌రావు, సొసైటీ మాజీ చైర్మన్ బండారు వెంకన్న, తండా వెంకటేశ్వర్లు, పోలేపాక నాగరాజు, చిదురాల వసంతరావు, బానోత్ వెంకన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భరత్‌చందర్‌రెడ్డి

ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు

మరిపెడ: మరిపెడలో నిర్వహిస్తున్న అండర్–17 బాలబాలికల జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు శుక్రవారం రాత్రి ముగిశాయి. ముఖ్యఅతిథిగా కలెక్టర్ శశాంక హాజరై బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తనకూ క్రీడలంటే ఇష్టమని, షటిల్ అంటే మరీ ఇష్టమన్నారు. 14 ఏళ్లుగా సొంత ఖర్చుతో క్రీడలు నిర్వహిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపుడి నవీన్‌ను అభినందించారు. జెడ్పీటీసీ శారద, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రామసహాయం సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కలెక్టర్ శశాంక

కార్మికుల సంక్షేమానికి చట్టం చేయాలి

బయ్యారం: వ్యవసాయ కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్రమైన చట్టం చేయాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఉమ్మగాని సత్యం డిమాండ్ చేశారు. శుక్రవారం బయ్యారంలో వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సంఘం ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్, కట్టయ్య, అశోక్, సూర్యం, యాకయ్య, వెంకన్న, శ్రీను, భాస్కర్‌రెడ్డి, మహేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

మహిళలపై దాడులను అరికట్టాలి

గంగారం : మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టడానికి పోరాటాలు చేయాలని ప్రగతి శీల మహిళా సంఘం పీఓడబ్ల్యూ జిల్లా సహాయ కార్యదర్శి వజ్జ సమ్మక్క అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళలు ఇంటి నుంచి బయటకు వెళ్లాలంటేనే భయపడే రోజులు వచ్చాయన్నారు. ఈ నెల 28, 29న మమబూబాబాద్ జిల్లా కేంద్రంలో జరిగే ప్రగతి శీల మహిళా సంఘం 3వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కమిటీ నాయకులు చింతం భద్రక్క, సిద్ధబోయిన సుమలత, జజ్జరి అరుణ, వజ్జ పాపక్క, ఎదలపెల్లి రమ, ఎదవపెల్లి సారమ్మ, వజ్జ శ్యామల, సిద్దబోయిన రజిత, మొల్కం పోతక్క తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సమ్మక్క

పరామర్శ

కురవి: మండలంలోని రాజోలు శివారు స్టేషన్‌గుండ్రాతిమడుగు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ తునగర్ భద్రు రెండు రోజుల క్రితం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ శుక్రవారం గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. భద్రు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోట లాలయ్య, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు ఎర్రంరెడ్డి సుధాకర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గార్లపాటి వెంకటరెడ్డి, సర్పంచ్ లాలు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ దీపక్, బీఆర్ఎస్ నాయకులు మాలి వీరన్న, మాలోత్ సూర్యానాయక్, బయ్య సోమయ్య ఉన్నారు.